క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ నిరసన

సదుం: పేదల ఇంటి స్థలాలపై మాజీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన, బైక్ ర్యాలీ చేపట్టనున్నట్టు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. అలాగే ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయుల ప్రచారం

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బాలికల ఇంటర్ కళాశాల్లో ప్రవేశానికి మండలంలోని గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం ఫజురుల్లా సోమవారం తెలిపారు. పాఠశాలల్లో సౌకర్యాలను పదో తరగతి పాస్ అయిన విద్యార్థినులకు వివరిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అన్ని సబ్జెక్టులను బోధించడానికి అధ్యాపకులను నియమించినట్టు ఆయన చెప్పారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలియజేశారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

సదుం: మండలంలోని జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం నుంచి వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30న కలశస్థాపన, మహాగణపతి పూజ, కంకణధారణ, అభిషేకాలు, నిత్యపూజ, 31న అభిషేకాలు, అలంకరణ, పుష్పపల్లకి ఊరేగింపు, అన్నదానం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

సదుం: పర్యావరణాన్ని రక్షించుకోవడం అందరి బాధ్యత అని గొల్లపల్లె ఫారెస్ట్ బీట్ ఆఫీసరు మహేష్ తెలిపారు. జోగివారిపల్లెలో పర్యావరణ సహిత జీవనశైలిపై సోమవారం అవగాహన కల్పించారు. వృక్షాలను నరకడం మానుకోవాలని, మొక్కలను పెంచడంతో పాటు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు వందనం


పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

గంగవరం: మండలంలోని కల్లుపల్లి గ్రామ సచివాలయం పరిధిలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వలంటీర్లను శాలువాలతో సత్కరించి సేవా పురస్కారాలు అందజేశారు. దీనికి హాజరైన ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో గ్రామ వలంటీర్ల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పట్టాభిరామయ్య, వేణుగోపాల్‌రెడ్డి, గోపిక్రిష్ణ, విజయ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శివుడికి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం భక్తులకు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గంగవరం: మండలంలో నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శివప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. గుండుగల్లు గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఈ రెండు రోజులు కార్యక్రమం ఉంటుందన్నారు. మంగళవారం గుండుగల్లు, హరిజనవాడ గ్రామాల్లో ఉదయం 6గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు.

ఉత్తమ సామాజికవేత్త సుభాన్


పురస్కారం అందుకుంటున్న సుభాన్

పలమనేరు: పట్టణానికి చెందిన దర్బార్ హోటల్ నిర్వాహకులు సుభాన్‌కు ప్రపంచ మానవ హక్కుల మండలి ఐదో వార్షికోత్సవం సందర్భంగా లక్నోలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సామాజిక వేత్త పురస్కారాన్ని అందించినట్టు సోమవారం తెలిపారు.

సారా విక్రేతల అరెస్టు

సదుం: ఇంట్లో సారా కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ మారుతి సోమవారం తెలిపారు. గుండ్లూరువారిపల్లెకు చెందిన రాజేంద్ర ప్రసాద్ వద్ద ఎనిమిది లీటర్లు, చింతపర్తివారిపల్లెకు చెందిన సయ్యద్‌ఖాన్ వద్ద ఏడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

ఆఖరికి ఈ మేనిఫెస్టోనూ కాపీనే


పలమనేరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ


పెద్దపంజాణి: సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే

- మీది అమలు చేస్తే ఏపీ శ్రీలంక కాదా?
- పలమనేరు బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ధ్వజం

పలమనేరు: చంద్రబాబు ఆఖరికి ఏపీ, కర్ణాటక పథకాలను కాపీకొట్టి మేనిఫెస్టో తయారు చేయాల్సి వచ్చిందని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్లను సమాధులతో పోల్చిన చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పలమనేరులో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించాయి. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి పట్టణ వీధుల గుండా మార్కెట్ కమిటీ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహం వరకూ ఈ ర్యాలీ సాగింది. అక్కడ ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నాటక మ్యానిఫెస్టో, ఏపీలో విజయవంతంగా అమలవుతున్న పథకాలను కాపీ కొట్టి మరోసారి రాష్ట్ర ప్రజలను ఏమార్చేందుకు చంద్రబాబు పథకం పన్నారని ఎద్దేవా చేశారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని విమర్శించిన టీడీపీ, ఇప్పుడు అదే సంక్షేమ పథకాలతో మేనిఫెస్టో తయారు చేయడం విడ్డూరమన్నారు. బిడ్డనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, మరోసారి జనాన్ని ఏమార్చేందుకు వస్తున్నారని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ జాఫర్, బాగారెడ్డి, చెంగారెడ్డి, ప్రహ్లాద, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

పెద్దపంజాణి: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ చెప్పారు. మండలంలోని నడింపల్లి, సూరకుంట్ల, నాగిరెడ్డిపల్లి, లింగమనాయునిపల్లిలో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి 447 గృహాలను సందర్శించారు. ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం పాలన సాగిస్తున్నారని తెలిపారు. అవినీతికి తావులేకుండా ఇంటి వద్దకే పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ప్రతిపక్ష పార్టీ నేతలకు దిక్కుతోచడం లేదని స్పష్టం చేశారు. చివరగా నాగిరెడ్డిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి, యోగనందీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మండల రైతు సలహా మండలి చైర్మన్ వెంకటరమణా రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ క్రిష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, సుహేబ్, మాకయ్య, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, సర్పంచ్ కుమారమ్మ, ఎంపీటీసీ సునంద, స్థానిక నాయకులు కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శేషాద్రిరెడ్డి, పార్టీ నాయకులు రాజా రెడ్డి, గురునాథ రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు చలో నేతిగుట్లపల్లె ప్రాజెక్టు


సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు: తెలుగుదేశం నాయకులు తప్పుడు కేసులతో స్టేలు తెచ్చి నిలిపివేసిన నేతిగుట్లపల్లె ప్రాజెక్టు సాధన కోసం చేపడుతున్న ఛలో నేతిగుట్లపల్లె ప్రాజెక్టు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి కోరారు. సోమవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్‌తో కలసి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రాజెక్టు సాధన సమావేశంలో పడమటి నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. టీడీపీ నాయకులు కాసులకు కక్కుర్తిపడి పడమటి నియోజకవర్గాలైన తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాలకు సాగు, తాగునీరు అందకుండా కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చారన్నారు. రైతులకు నీటి అవసరాలను కూడా తీర్చకుండా నీచంగా ప్రవర్తిస్తున్న టీడీపీ నాయకులకు తగిన గుణపాఠం నేర్పాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శివకుమార్, రమణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోండి


గుడుపల్లె: విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని రైతులు ఖరీఫ్‌లో వర్షాధార పంటగా సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ధరలపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తోంది. సోమవారం నుంచి విత్తనకాయలు కావలసిన రైతులు 30 కేజీల బస్తాకు రూ.1,674 చెల్లించి ఆర్‌బీకేలలో తమ పేరు నమోదు చేసుకోవాలని ఏఓ శ్రీనివాసులు తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, సెల్ నంబరుతో రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుని రసీదు పొందాలని తెలిపారు.

గుడుపల్లె: రాయితీపై వేరుశనగ కాయల విత్తనాలను సోమవారం ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి పంపిణీ చేశారు. మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి 560 హెక్టార్లకు గాను 540 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌ను తీసుకుని ఆయా రైతు భరోసా కేంద్రాలకు వద్దకు వెళ్లి, బయోమెట్రిక్ చేసుకుని, వేరుశనగ కాయల విత్తనాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగరాజు, సర్పంచ్ చెన్నరాయన్ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 10 మంది ఎంపిక

రొంపిచెర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో పది మంది మహిళలు ఎంపికైనట్లు ఎస్ఎంసీ కంపెనీ ప్రతినిధి నవీన్ తెలిపారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఎస్ఎంసీ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఎంపికైన వారికి నెలకు రూ.13 వేలు నుంచి రూ.15 వేలు వరకు జీతం ఇస్తామన్నారు. ఎంపికైన వారికి ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు


ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలోని దండపల్లి రోడ్డు వద్ద వెలసిన హజరత్ గంజ్ షాహిద్ షావలి జలాలుద్దీన్ బాబా 75వ ఉరుసు మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఖవాలీతోపాటు, హజరత్ సమాధికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. ఆయన్ను నిర్వాహకులు బీడీ మస్తాన్, సర్వర్, హైదర్, ఖదీర్, ఎజాజ్, అస్లాం తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అది పేదలను మోసం చేసే మేనిఫెస్టో


బైరెడ్డిపల్లెలో విలేకర్లతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

బైరెడ్డిపల్లె: మరోసారి పేదలను మోసం చేయడానికే చంద్రబాబు మేనిఫెస్టో ప్రవేశపెట్టారని, అది చెత్త బుట్టతో సమానమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మండిపడ్డారు. బైరెడ్డిపల్లెలో డీసీసీబీ చైర్‌పర్సన్ నివాసం వద్ద సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2014 మేనిఫెస్టోలో వందలాది హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు మహానాడులో కొత్తగా ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో ప్రజలకు ఒరిగేదేమీలేదని చెప్పారు. 2014 మేనిఫెస్టోపై ఎవరైనా ప్రశ్నిస్తారని 2015లోనే వెబ్‌సైట్ నుంచి తొలగించిన బాబు చిత్తశుద్ధి ఏంటో ప్రజలకు తెలుసని చెప్పారు. బాబు హయాంలో రాష్ట్రానికి 22వ ర్యాంకు ఉండేదని, ప్రస్తుతం జగనన్న పాలనలో నంబర్ వన్ ర్యాంకులో ఉందని స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, పదవిని, పార్టీని లాక్కొని, ఆయన మరణానికి కారణమైన వారు ఆ రక్తపు చేతులతోనే నేడు దండలు వేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసేందుకే మళ్లీ ఎన్టీఆర్ బొమ్మతో వస్తున్నాడని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలవడం ఖాయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ తమ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, మండల సచివాలయ కన్వీనర్ కార్తీక్, సర్పంచులు వెంకటేష్, రాజప్ప, వైఎస్సార్‌సీపీ నేతలుపాల్గొన్నారు.

చంద్రబాబుకు మతిభ్రమించింది..

పుంగనూరు: పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలపై చంద్రబాబు సమాధులు కట్టేందుకా ఈ స్థలాలు అని అవహేళనగా మాట్లాడడాన్ని నిరసిస్తూ స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం పట్టణంలో భారీ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో బాబుకు వెన్నులో వణుకు పుట్టిందని, దీంతో చంద్రబాబు మతిభ్రమించి నీచమైన మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్, నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, చెంగారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రాజేష్, సురేష్, ప్రశాంత్‌రెడ్డి, అర్షద్‌అలీ, బందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తగిన బుద్ధి చెబుదాం

చౌడేపల్లె: ప్రజల సంక్షేమాన్ని అడ్డుకుంటూ రాక్షసానందం పొందుతున్న చంద్రబాబునాయుడుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు పిలుపునిచ్చారు. సోమవారం చౌడేపల్లె మేజరు పంచాయతీ సర్పంచ్ వరుణ్ భరత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ నిరసన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. బస్టాండు నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వంచారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, లడ్డూ రమణ, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, ఎంపీటీసీ శ్రీరాములు, నేతలు అల్తాఫ్, సద్దాం, రమేష్‌బాబు, రమణ, మంజునాథ్, చందు, వెంకటరమణ, హరి తదితరులు పాల్గొన్నారు.

బాబుది దుర్మార్గపు వైఖరి

రొంపిచెర్ల: పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను మాజీ సీఎం చంద్రబాబు నాయుడు శ్మశాన వాటికలతో పోల్చడం సిగ్గు చేటు అని, అతనిది దుర్మార్గపు వైఖరి అని జెడ్పీటీసీ సభ్యులు రెడ్డీశ్వర్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రొంపిచెర్ల క్రాస్ రోడ్డు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదలందరికి ఇళ్ల స్థలాలను ఉచితంగా పంపిణీ చేస్తుంటే ఓర్చుకోలేని చంద్రబాబు వాటిని శ్మశానాలతో పోల్చడం సరికాదన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, నాయకులు కోటా వెంకటరమణ, సూర్యనారాయణ రెడ్డి, కమలాకర్ రెడ్డి, కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, దుర్గాప్రసాద్ రెడ్డి, సురేంద్రనాయుడు, నాగరాజ, ప్రకాష్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో నవశకానికి నాంది


సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవశకానికి నాంది పలికారని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సోమవారం సాయంత్రం రామకుప్పంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు. ఆయా కుటుంబాల్లో లబ్ధిదారులు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. రామకుప్పంలో అదనంగా మరో రూ.2 కోట్లతో టౌన్ మొత్తం సీసీ రోడ్లు వేయడం పూర్తి చేస్తామన్నారు. జగనన్న లే అవుట్‌లో ఇళ్లస్థలాలు కేటాయించాలని పలువురు ఎమ్మెల్సీని కోరారు. జగనన్న లే అవుట్ పనులను త్వరితగతిన పూర్తిచేసి అర్హులకు ఇంటిపట్టాలు పంపిణీ చేయాలని ఆయన రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండల కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, వార్డు సభ్యులు జమీను ప్రసాద్, గోపి, నేతలు నారాయణస్వామి, కేశవ రెడ్డి, సుగుణప్ప, యశ్వంత్ రెడ్డి, బల్ల సర్పంచ్ విజయ్ థామస్, రఘు పాల్గొన్నారు.

ఉత్తమ వలంటీర్లకు సన్మానం


పుంగనూరులో వలంటీర్లను సన్మానిస్తున్న అమ్ము, సీఆర్ లలిత

పుంగనూరు: పట్టణంలోని రెండో సచివాలయ పరిధిలో ప్రజలకు విశిష్ట సేవలు అందించిన వలంటీర్లకు సోమవారం జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ వైస్ చైర్మన్ సీఆర్ లలిత కలసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లకు శాలువా కప్పి ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నిధులతో కొనుగోలు చేసిన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్ము మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రజలకు అన్నిరకాల వసతులు ఇంటి వద్దే అందిస్తున్నారని, ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి


పుంగనూరు: ఉర్దూ గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్, నసీబ్‌జాన్

పుంగనూరు: ప్రతి ఒక్కరూ ఉర్దూ భాషాభివృద్ధికి చేయూత అందించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్ కోరారు. సోమవారం ఆయన పట్టణంలోని ఉర్దూ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి నసీబ్‌జాన్‌తో వివిధ విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధి, ఉర్దూ అకాడమీ ఉద్యోగుల ధ్యేయం కావాలన్నారు. ఉర్దూ భాషకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మైనారిటీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఉర్దూ గ్రంథాలయాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సలీమ్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ యువరాజు పేర్కొన్నారు. మండలంలోని చింతమాకులపల్లి రైతుభరోసా కేంద్రంలో సోమవారం రైతులకు వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం ముదరందొడ్డి పంచాయతీ నడిపేపల్లిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, సర్పంచులు రామచంద్రప్ప, దామోదరం, ఉప సర్పంచ్ రమణప్ప, సచివాలయం కన్వీనర్లు, రమేష్, నాగరాజు, మంజునాథ్, సెరికల్చర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టి.వడ్డూరులో టీబీపై అవగాహన


టి.వడ్డూరు గ్రామంలో టీబీ సర్వే చేస్తున్న యూనిట్ సిబ్బంది

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో టీబీపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక టీబీ యూనిట్ అధికారులు సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా టీబీ ఎలా సోకుతుంది, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటి సర్వే చేసి టీబీ బాధితులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ అధికారులు విజయకుమార్, గౌతమి, జగదీశ్వరి, గ్రామ సర్పంచ్ బెంగళూరు మునస్వామితోపాటు ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో బూటకం


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్

కుప్పం: చంద్రబాబు మహానాడులో ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టో బూటకపు మేనిఫెస్టో అని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం ర్యాలీ ఏరియా ఆస్పత్రి ఎదుట వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కుప్పం చెరువుకట్ట, రైల్వేస్టేషన్, ఫ్లై ఓవర్ మీదుగా కుప్పం బస్టాండు వరకు 2 వేల మంది యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్, చిత్తూరు ఎమ్మెల్సీ మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ఓర్వలేక, అధికారంలోకి రాలేక చంద్రబాబు నెరవేరని మేనిఫెస్టోను ప్రకటించారని, హామీలు నెరవేర్చడం అసాధ్యమని చంద్రబాబుకు సైతం తెలుసని, కేవలం ప్రజలను మభ్యపెట్టి గద్దె ఎక్కేందుకే ఇలాంటి హామీలు ఇచ్చారని తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో 4 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. ప్రజాదరణ పథకాలతో జగన్ జనం గుండెల్లో నిలిచిపోయారని, ఈ ఆదరణను ఓర్వలేక చంద్రబాబు అండ్‌కో..ఈనాడు, ఆంధ్రజ్యోతి, దత్తపుత్రుడు కలిసి ఎన్ని కుట్రలు చేసినా, విషపు రాతలు రాసినా, దుష్ప్రచారం చేసినా జనం గుండెల్లో జగన్‌ను చెరపడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో రాజకీయ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, మొగసాల రెడ్డెప్ప, రెస్కో చైర్మన్ సెంథిల్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, జెడ్పీటీసీలు ఏడీఎస్ శరవణ, నితిన్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, ఎంపీపీలు అశ్విని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంది జగనన్న ప్రభుత్వమే

కుప్పం రూరల్: రైతాంగం కష్టాలను గుర్తించి రైతులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సోమవారం మండలంలోని చందం పంచాయతీలో వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి రైతులకు పెద్దపీట వేశారని, తరువాత జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే ఆ తరహాలో రైతులను ఆదుకుంటున్నారన్నారు. సకాలంలో విత్తనాలు ఇవ్వడం, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం చేయడం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం.. ఇవన్నీ జగనన్న చలవే అన్నారు. 30 కిలో వేరుశనగ బస్తా సబ్సిడీ కింద రూ.1674లకు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, సర్పంచ్ కుమారస్వామి, నాయకులు మురుగేష్, మదన్‌కుమార్, వ్యవసాయాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.